# అడిగిన వదిన



గంటనుండి తనవంక తదేక దృష్టితో చూస్తున్న ఆ పిల్లవాడిని చూసి చిన్నగా నవ్వేడు గోపన్న. చేతిలోని పారా పలుగు తట్టలో పెట్టి, తలగుడ్డ విప్పి తల చుట్టు కొన్నాడు. నుదిటిపై నుండి కారుతున్న చెమటను పై పంచెతో తుడుచుకున్నాడు. తలెత్తి చూసేసరికి ఇంకా ఆ పిల్లడు అక్కడే ఉన్నాడు. కుతూహలంగ అలాగే చూస్తున్నాడు.

విరిసీ విరియని గులాబి మొగ్గలా ముద్దుగా, బొద్దుగావున్న ఆ పిల్లాడిని చూస్తే గోపన్నకి దగ్గరికి పిలిచి మాట్లాడాలని మన సయింది. రెండు అడుగులు వేసి మెల్లగా నవ్వుతూ దగ్గరికి రమ్మని చెయ్యి ఊపేడు. ఆ పిల్లడు కిలకిల నవ్వుకొంటూ, నరెండు చేతులతో ముఖం కప్పుకొని ఇంటివైపు పరుగు తీసేడు.

ఎవరి పిల్లాడో ఈ కుర్రాడు చూడ ముచ్చటగా ఉన్నాడు. పలకరిస్తే అంత సిగ్గెందుకో? ఒకటే పరుగు పెట్టేడు అను కొన్నాడు గోపన్న.

ఎండ చల్లబడే వేళకి రోజు విధిగా వచ్చేవాడు ఆ కుర్రాడు. గోపన్న తనపని ముగించుకొని లేచేవరకు అక్కడే నిలబడి కుతూహలంగా చూసేవాడు. గోపన్న తనని చూసి నవ్వగానే వెనుతిరిగి చూడకుండా పరుగు తీసేవాడు.

రోజులు గడుస్తున్న కొలది వారిద్దరి మధ్య అది ఒక ఆటలా తయారయింది. ఒకటి. రెండుసార్లు పరుగున వెళ్ళి ఆ పిల్ల వాడి చెయ్యి పట్టుకుని "పిలుస్తే రాకండా ఎందుకలా పారిపోతావు? నీ పేరేమిటి?" అని అడగాలను కొన్నాడు గోపన్న.

కాని ఆ పిల్లడు బెదిరిపోయి, అలక సాగించో మరునాటి నుండి రాడేమో అనే సంశయంతో ఊరుకొన్నాడు. ఉదయం నుండి పరిశ్రమించిన గోపన్న శరీరానికి ఆ కుర్రాడి చిరునవ్వు చందనపు పూతలా చల్లదనం కలిగించేది.

ఆ రోజు వేళ తప్పింది ఉదయాన్నే వచ్చేడు ఆ కుర్రాడు. తనపనిలో నిమగ్నుడై వున్న గోపన్న అప్రయత్నంగా అటు దృష్టి మరలించేసరికి ముందుగా తనే నవ్వేడు. ఆ పిల్లవాడి నవ్వుకు జవాబుగా గోపన్న ఒకసారి మందహాసం చేసి తిరిగి తన పనిలో మునిగి పోయేడు.

అరగంట గడిచేక ఇంకా ఆ కుర్రాడు అక్కడే ఉన్నాడా అని తిరిగి చూసేడు. మెల్ల మెల్లగా ఒక్కొక్క అడుగు వేస్తూ ఆసరికి గోపన్నకి నాలుగు బారల దూరంలోకి వచ్చేడు ఆ పిల్లవాడు. అదివరలో తను పిల్చినా రాని వాడు ఆ రోజు తనంతట తనే దగ్గరికి రావడం చూసి గోపన్న ఆశ్చర్య పోయేడు.

గోపన్నని చూస్తూ మరి నాలుగు అడు గులు వేసేడు ఆ కుర్రాడు. ఎండలో రెండు బుగ్గలు పళ్ళానికి వచ్చినటొమాటాల్లా ఎర్రగా వున్నాయి. నూనె రాయని జుట్టు గాలికి ఇటు అటు కదులుతున్నది. చేతితో కళ్ళలో పడు తున్న జుట్టుని పైకితోసుకొంటూ "ఈరోజు నాపుట్టిన రోజు" అన్నాడు.

గోపన్న కన్నార్పకుండా ఆ పిల్లవాడిని చూస్తున్నాడు.

"నా కొత్త లాగు, లాల్చి, లోపల బనీను కూడా కొత్తదే" లాల్చి పైకెత్తి పట్టుకొని చూపించేడు.

"అబ్బో. చాలా బాగున్నాయే. ఎవరు కొన్నారు?"

ఆ మాత్రం తెలియదా? అన్నట్లు తెల్ల బోయి చూసేడు ఆ కుర్రాడు.

"నీ పేరేమిటి?".... గోపన్న ప్రశ్నిం చేడు.

"చిట్టిబాబు. అమ్మ 'చిట్టీ' అని పిలు స్తుంది. తాతయ్య 'బాబూ' అని పిలుస్తాడు. మరేం....ఈరోజు నా పుట్టిన రోజు. నాన్న కొత్త బట్టలు కొన్నారు. అమ్మ అప్పచ్చులు చేస్తున్నది_" తను చెప్పదలచుకొన్న దంతా గుక్క తిప్పుకోకుండా చెప్పి పరుగు లంకించు కొన్నాడు చిట్టిబాబు.

ఆనాటినుండి వారి స్నేహం వృద్ధిగా సాగింది. సాయంకాలం పని పూరయేక చిట్టిబాబుతో కొంతసేపు కాలక్షేపం చెయ్య డం గోపన్న నిత్యకృత్యాలలో ఒకటిగా మారింది.

చిట్టిబాబుకి ఎన్నో తెలుసుకోవాలని ఉంటుంది. ఇంట్లో అమ్మని, నాన్నని అడి గితే "ఏమిటిరా నీ యక్ష ప్రశ్నలకి అంతం లేదా" అని విసుక్కొంటారు. అడిగిన ప్రతి మాటకి విసుక్కోకుండా జవాబు చెప్తాడు గోపన్న. అందుకే చిట్టిబాబుకి అతడంటే అంత ఇష్టం. గోపన్నని "తాతా" అని పిలిచేవాడు చిట్టిబాబు.

"మా ఇంట్లో కూడా ఒకతాత ఉన్నాడు.

ద్వివేదుల విశాలాక్షి

నువ్వు ఇంకో తాతవి. నాకు రెండుతాతలు." అన్నాడు ఒక రోజున.

............

"మరేం మా ఇంట్లో తాత అస్తమానం పక్కమీద పడుకొని దగ్గుతుంటాడు. నువ్వేమో గోతులు తవ్వడం, రాళ్ళు మొయ్యడం ఎందుకు చేస్తుంటావు. నీకు ఆ తాతలా పడుకోవాలని వుండదా ?' అని ప్రశ్నించేడు చిట్టిబాబు.

"మరి బువ్వకి డబ్బు కావాలికదా చిట్టిబాబు ! నేను గోతులు తవ్వుతూ రాళ్ళు మోస్తూ ఇలాపనిచేస్తుంటే గవన్మెంటోరు నాకు డబ్బిస్తారు. ఇక్కడ పెద్ద బ్రిడ్జి కడుతున్నారా ? దానికి పునాదులు వెయ్యాలి మరి."

చిట్టిబాబుకి తాత అన్న రెండు మాటలు అర్థం కాలేదు.

"అంటే ?" అన్నాడు తాత కళ్ళలోకి చూస్తూ.

"అదిగో. ఆ ఏరుందా ! అది దొంగ ముండా ఏరు. చెప్పా చెయ్యాకుండా వచ్చి పడుతుంది. వర్షాకాలంలో ఇటు అటు దాటుతున్న మనుషుల్ని, పశువుల్ని చంపేస్తుంది."

"అవును. మా ఇంట్లో వున్న పిల్లి పిల్లని ఓ దొంగ ముండా కుక్క కరిచి చంపేసిందట. అమ్మ చెప్పింది. ఆ కుక్కకి ఇంతంతేసి పళ్ళున్నాయి. తాతా ! మరి ఏరుకి పళ్ళు ఎక్కడ వున్నాయి ?"

"ఏరు పళ్ళు లేకుండానే చంపేయగలదు. లోతుగా నీరుంటే మనుష్యులు మునిగి చచ్చిపోతారు. అందుకోసం దానిమీద పెద్ద రోడ్డు వేస్తున్నారు. అప్పుడు హాయిగా ఏట్లో దిగనక్కర లేకుండా ఈ ఒడ్డు నుండి, ఆ ఒడ్డుకి నడచి పోవచ్చు. నీ వంటి చిన్న పాపలు కూడా నాన్న చెయ్యి పట్టుకొని నడుచుకొంటూ వెళ్తే తమాషాగా ఉంటుంది కదూ ?"

చిట్టిబాబుకి కొంత అర్థమయినా పూర్తిగా బోధపడ లేదు. ఏటిమీద రోడ్డు ఎలా వుంటుదో ఊహించుకోలేక పోయేడు. నువ్వు కూడా తోటలోకి వస్తానంటే ఏట్లో మునిగి పోతావు. రాకూడదు, అనేవాడు అన్న. ఈసంగతి అన్నయ్యతో తొందరగా చెప్పాలి అనుకున్నాడు చిట్టిబాబు.

"ఏటి మీద రోడ్డు వేస్తున్నారుట. ఇంకే నేనూ నీతో తోటలోకి రాగలను" ఉత్సాహంగా అన్నట్లో అన్నాడు చిట్టిబాబు.

"ఈ సంగతి నీకెవరు చెప్పేరురా ?" తండ్రి ప్రశ్నించేడు.

"అక్కడ గోతులు తవ్వే తాత చెప్పేడు. తాత చాలా మంచివాడు. నాకు బోల్డు కబుర్లు చెప్పుతాడు" అన్నాడు.

తాత పేరు అడిగితే చిట్టిబాబు చెప్పలేక పోయేడు. మర్నాడు వస్తూనే "నీపేరేమిటి తాతా ?" అన్నాడు.

"గోపన్న" తాత జవాబు చెప్పేడు.

"అయితే గోపన్నతాత అని పిలవనా?"

"నీకెలా పిలవాలనిపిస్తే అలాగే పిలువు."

"నేను ముందులాగే తాతా అని పిలుస్తే పలుకుతావా ?"

"ఓ....తప్పకుండా" అన్నాడు తాత.

తాత పనిచేస్తుంటే కన్నార్పకుండా చూసే చిట్టిబాబుకి తాతపై చెప్పలేనంత జాలి కలిగేది. పెద్దపెద్ద రాళ్ళని తాత పెల్లగిస్తుంటే ఆ బరువు తను మోస్తున్నట్లు చూసేవాడు. అతడు తవ్వుతున్న గోతుల్ని చూసి "అమ్మో. ఎంతలోతో." అని ఆశ్చర్యపోయేవాడు. తాత అలసి పోయి చెయ్యాపుకొని ఉస్సురని నిట్టూరుస్తుంటే "ఇంక చాలులే తాతా! ఆపేయ్" అనేవాడు.

"ఆపేస్తే ఎలా నాయనా ! ఇంకా బాగా లోతుగా తవ్వాలి. లేకపోతే బ్రిడ్జి కూలిపోతుంది. దానిమీద నడుస్తున్న నీ వంటి పాపలు నీటిలో పడి కొట్టుకు పోతారు." అనేవాడు గోపన్న.

"అమ్మో. నీళ్ళంటే నాకెంతో భయం వేస్తుంది. ఇంకా బాగా తవ్వు తాతా ! ఇంకా లోతుగా...." అంటూ గోపన్నని ఉత్సాహ పరచేవాడు చిట్టిబాబు.

సాయంకాలం పని పూర్తి అయేక గోపన్న చేతులు కలుపు కొంటుంటే "తాతా! చేతులు నొప్పిపెట్టేయా ?" అని తన చిన్న చేతులతో తడిమి చూసేవాడు.

కాయకష్టంతో మొద్దుబారిన తాత చేతులు పచ్చ నరాలు పొడుచుకొచ్చి వికృతంగా ఉండేవి.

"నీచేతుల మీద ఎన్నిపాములో? మా తాతయ్య చేతులమీదకూడా పాములున్నాయి" అనేవాడు,

తాతచేతులతో పోల్చి చూసుకుంటే తనవి మరీ చిన్నవిగా అగుపించేవి చిట్టిబాబుకి. "నావి నీ అంత చేతులయేక నేనూ గోతులు తవ్వుతాను. నీకంటే లోతుగా.... ఇంకా లోతుగా, నుయ్యంత లోతుగా...."

"నువ్వు నా లాగా గోతులెందుకు తవ్వుతావు చిట్టిబాబూ. అదిగో, చూడు ఆ అయ్యగారిలా పెద్ద చదువులు చదువుకొని పెద్ద ఉద్యోగం చేస్తావు. నావంటి వారికి నూరు మందికి పని కల్పిస్తావు." అనేవాడు తాత చిట్టిబాబు బుగ్గలు చిదిపి ముద్దు పెట్టుకొంటూ.


చిట్టిబాబు సిగ్గుతో ముసిముసి నవ్వు నవ్వుతూ తాత చేతుల్లోంచి తప్పించుకొని పారిపోయేవాడు.

"తాతా ! ఏటిమీద రోడ్డువేస్తే నీట్లో మునిగిపోదా ?" చిట్టిబాబు విధిగా రోజూ తాతని అడుగుతూండే ప్రశ్నలవి.

నీటిలో మునిగి పోకుండా రోడ్డు ఎలా వేస్తారో తాత చెప్పినా చిట్టిబాబుకి అర్థమయేది కాదు. నమ్మకం కుదిరేదికాదు. మసి బొగ్గుతో రాయిమీద బ్రిడ్జి ఎలా వుంటుందో బొమ్మవేసి చూపించాలని తాపత్రయ పడేవాడు గోపన్న. కాని, అతనికి చాతనయేది కాదు.

ఒకనాడు ఇంజనీరు పని పూర్తి అయేక ఆ బ్రిడ్జి నమూనా తెచ్చి కంట్రాక్టర్లకి చూపిస్తున్నాడు. దానిని చిట్టిబాబు చూస్తే సంతోషిస్తాడు అనుకొన్నాడు గోపన్న. చేతిలోని పనివదిలి ఊరువైపు పరుగు తీసేడు. దారిలోనేచిట్టిబాబు రోడ్డుమీద పిల్లలతో ఆడుకొంటూ కనిపించేడు. గోపన్న తిరిగి వచ్చేసరికి అక్కడ చేరిన అందరూ చూడడం పూర్తయి ఆ నమూనా బ్రిడ్జిని పెట్టిలో పెట్టేశారు. ఆశతో చిట్టిబాబుని తీసుకువచ్చిన గోపన్న దిగులు పడ్డాడు.

"బాబుగారూ ! బాబుగారూ, ఆ బొమ్మని ఒక్కసారి పైకితీసి చూపిస్తారా ? ఈ అబ్బాయి చూస్తానని సంబర పడుతున్నాడు. పాపం బ్రిడ్జి చూపిస్తానంటే ఊర్లోంచి పరుగుపెట్టి వచ్చేడు." అన్నాడు గోపన్న ప్రాధేయ పడుతూ.



"ఎవరీ కుర్రాడు ? అసలు నువు పని వదిలి ఎక్కడికి పోయేవు ? నీ ఇష్టం వచ్చి నట్లు ఊరంట తిరుగుతూ సాయం కాలం అయేవరికి కూలిపట్టుకు పోడానికి నీ అబ్బ సొమ్ము నా దగ్గర దాచే ననుకొన్నావా ?" మేస్త్రి గోపన్నని కేకవేసేడు.

చిట్టిబాబు భయంగా గోపన్న చెయ్యి పట్టుకొని "రా తాతా పోదాం" అన్నాడు మెల్లిగా.

గోపన్నకి ఇంకా ఆశ చావలేదు. మెల్లిగా కంట్రాక్టరుని. మేస్త్రిని తప్పించుకొని ఇంజనీరు దగ్గరికి వెళ్ళేడు.

"బాబుగారూ ! మీరు తెచ్చిన ఆబొమ్మని ఈ కుర్రాడికి ఒక్కసారి చూపించండి బాబూ ! ఎంతో సంబర పడుతున్నాడు" అన్నాడు చేతులుజోడించి వినయంగా.

"ఎవరీ కుర్రాడు ?" తనవంకేనిదానంగా చూస్తున్న చిట్టిబాబుని పరికిస్తూ అడిగేడు ఇంజనీరు.

"మా తాత" అన్నాడు చిట్టిబాబు ముద్దుగా.

ఒక్క నిమిషం వారిద్దరినీ మార్చిమార్చి చూసి, పక్కనున్న వాడితో ఏమో చెప్పేడు ఇంజనీరు.

నమూనా బ్రిడ్జి చిట్టిబాబు కళ్ళముందుకి వచ్చింది. దానిని అతి శ్రద్ధగా వంగి వంగి చూసేడు చిట్టిబాబు. ఆ పిల్లడి ఆసక్తిని, కళ్ళలో కదదులుతున్న తృప్తిని చూసి "బాగుందా" అని ప్రశ్నించేడు ఇంజనీరు.

"ఎంతో బాగుంది. నేను పెద్దవాణ్ణి అయ్యేక ఇలాటి పెద్దరోడ్డు కడతాను." చిట్టిబాబు దానిమీదనుంచి దృష్టి తియ్యకుండానే అన్నాడు ఉత్సాహంగా.

ఇంజనీరు తన తోలుసంచిలోంచి ఒక ఫొటోతీసి "నువ్వు ఇటువంటి పెద్ద బ్రిడ్జి కట్టాలి" అంటూ ఆ పిల్లడి చేతిలో పెట్టేడు.

గోపన్న భక్తితో అతనికి నమస్కారం పెట్టేడు. "చిట్టిబాబూ! ఇంజనీరు బాబుకి దండం పెట్టు" అన్నాడు.

చిట్టి తన చేతులుజోడించి నమస్కారం పెట్టేడు. తిరిగివస్తూ "ఈయన ఎలా మంచి వాడు. ఆయన మంచివాడు కాడు" అన్నాడు మేస్త్రీని వేలుతో చూపుతూ.

"అంతా మంచివాళ్ళే బాబు! మన కోసం ఎంతో కష్టపడి ఇలాటి బ్రిడ్జీలు, ఆనకట్టలు కడతారు" అన్నాడు గోపన్న.

గోపన్న ఏమి చెప్పినా చిట్టిబాబుకి మేస్త్రీపైనా, కంట్రాక్టరు పైనా గౌరవం కుదరలేదు. వాళ్ళు ఏ పని చెయ్యకుండా ఇటుఅటు తిరుగుతూ, పనిచేస్తున్న గోపన్న తాతలాటి వాళ్ళని కేకలేస్తారని చిట్టిబాబుకి వాళ్ళపై కోపం.

వేసవికాలం సెలవలు కారణంగా స్కూలు మూతపడింది. రోజులో చాలా భాగం చిట్టిబాబు బ్రిడ్జి చుట్టుప్రకలే తిరుగుతూండేవాడు. ఎండలో తిరిగి పిల్లడు వాడి పోతున్నాడని తల్లి ఎంత ప్రయత్నించినా ఆ కుర్రాడిని ఇంటిదగ్గర ఆపలేకపోయింది.

గోపన్న తాత కడుతున్న బ్రిడ్జి రోజు రోజుకి పెరుగుతూంటే చిట్టి మనసు సంతోషంతో ఉరకలు వేయసాగింది. పని వాళ్ళు రాళ్ళు కొడతున్నా, ఆ సీ మేస్త్రీలు సిమ్మెంటుపని చేస్తున్నా, వడ్రంగులు స్క్రూలు బిగిస్తున్నా, అంత తిన్నగా చేస్తున్నారా, లేదా, ఆ రోడ్డుమీద నడుస్తుంటే తను ఏట్లో పడిపోడు కదా అనే భయంతో, సంశయంతో పట్టిపట్టి చూసేవాడు. తాత పనిలో మాత్రం చిట్టిబాబుకి ఏటువంటి అనుమానం ఉండేదికాదు. గోపన్న తాత లేకపోతే ఇంకెవరూ ఆ పని చెయ్యలేరని ఆ పిల్లవాడి నమ్మకం.

ఎండదెబ్బ తగిలి మూడురోజులు చిట్టిబాబుకి కొంచెం జ్వరం వచ్చింది. ఆ మూడు రోజులు గోపన్నకి చెయ్యి కోసుకొన్నట్లు పని తెమలలేదు. ఒక పని చెయ్యబోయి ఇంకొకటి చేస్తూ మేస్త్రీచేత చీవాట్లు తిన్నాడు. నాలుగోనాడు చిట్టి తిరిగి వచ్చేసరికి తాతకి పనిలో చురుకు తగిలింది.

చిట్టిబాబు గుణింతాలు నేర్చేసరికి బ్రిడ్జి పని పూర్తిఅయింది. ఆ పిల్లడు చిన్న చిన్న వాక్యాలు వాయగలిగే సరికి తుది మెరుగులు దిద్దుకొంది. గోపన్న చెయ్యి పట్టుకొని చిట్టిబాబు బ్రిడ్జి ఈ చివర నుండి ఆ చివర వరకూ నడిచేడు. "నేను, నువ్వు నడచినా ఈ రోడ్డు పడిపోలేదు తాతా! నువ్వు గోతులు లోతుగా తవ్వేవుకదూ. అందుకే ఇంత గట్టిగా వుంది" అన్నాడు. ఆ రోజు మాష్టరుగారి నడిగి బ్రిడ్జి అన్న పదం వ్రాయడం నేర్చుకొన్నాడు. దాన్ని తన పలక మీద వ్రాసి చూపించేడు.

ఏపని అయినా గట్టిగా వుండాలంటే పునాది దిట్టంగా ఉండాలని అది వరలో గోపన్న చిట్టిబాబుతో చెప్పుతూ వుండేవాడు. ఆపిల్లడి మనసులో ఆ మాట నిలిచి పోయింది. కొన్ని వందల మందికాయకష్టం, నేర్పరితనం అందుకొని ఆ వంతెన రూపుదాల్చింది. కాని చిట్టిబాబుకిమాత్రం తాత తవ్విన గోతులవల్లే అది అంత బాగా తయారయింది.

"రేపు నేను వెళ్ళిపోతున్నాను చిట్టిబాబూ" అన్నాడు గోపన్న.

"ఎక్కడికి?"

పని ఎక్కడ దొరికితే అక్కడికి, తిండి ఎక్కడ పుడితే అక్కడికి అని చెప్పాలనుకున్నాడు గోపన్న. కాని అలాచెప్పితే ఆ మాటలు చిట్టిబాబుకి అర్థంకావు. అందుకే "అమ్మదగ్గరికి" అన్నాడు.

"నీకు అమ్ముందా! మా తాతయ్యకి అమ్మ లేదట. అమ్ముంటే ఎంతో మంచిది. అప్పచ్చులు చేసి పెడుతుంది" అన్నాడు,

"మళ్ళా ఎప్పుడు వస్తావు తాతా?" అని ప్రశ్నించేడు చిట్టిబాబు.

ఈ ఊరు తిరిగి రావలసిన పనేముంటుంది? కొత్త కట్టడాలు లేచిందికి ఇదేం పెద్ద పట్నంకాదు. ఉన్న ఒక్క అవసరం తీరిపోయింది. తిరిగి ఈ జన్మలో తను ఈ మట్టిమీద కాలు పెట్టక పోవచ్చును. అనుకొన్నాడు గోపన్న. ఆ ఆలోచన అతనికి బాధాకరమయింది. తిరిగి తను చిట్టిబాబుని చూడబోననే సత్యం కళ్ళముందు సుళ్ళు తిరిగింది. కళ్ళలో నీళ్ళు తిరిగేయి గోపన్నకి. అతడి ముఖాన్ని వింతగాచూస్తూ, "మళ్ళారావా తాతా?" అన్నాడు చిట్టిబాబు. ఆత్రంగా గోపన్న కళ్ళు తుడుచుకొని చిట్టిబాబుని చేతుల్లోకి తీసుకొన్నాడు. "ఎందుకు రాను బాబూ! నువ్వు పెద్దవాడివై బ్రిడ్జీలు కడితే మరినేను గోతులు తవ్వొద్దూ?" అన్నాడు.

"అవును తాతా! నువ్వు పెద్ద పెద్ద గోతులు లోతుగా, ఇంకా లోతుగా తవ్వాలి. నేపెద్ద ఆకాశమంత బ్రిడ్జి కడతాను." అన్నాడు చిట్టిబాబు ఉత్సాహంగా,

రెండురోజులనాడు ఆ ప్రదేశం నుండి కూలీల గుడిశెలు తీసివేసేరు. అక్కడ అంతా బాగుచేసి పెద్ద పందిరి వేసేరు. దానికి రంగు కాగితాల తోరణాలు కట్టేరు. పందిరి స్తంభాలను అరటి మొక్కలతో అలంకరించేరు. ఈ హంగామా అంతా చిట్టిబాబు చూసేడు.

"నాన్నా అక్కడ పందిరి ఎందుకు వేసేరు?" అని ప్రశ్నించేడు.

ఈ రోజు మంత్రిగారు వచ్చి కొత్తగా కట్టిన ఆ బ్రిడ్జికి ప్రారంభోత్సవం చేస్తారు. అక్కడ సభ జరుగుతుంది." అన్నాడు తండ్రి,

చిట్టికి తండ్రిమాట అర్థంకాలేదు.

"అంటే" తిరిగి ప్రశ్నించేడు.

"నీకెలా చెప్పినా బోధ పడదురా, అంతా చూస్తూ ఉండు. నీకే తెలుస్తుంది. రేపటినుండి మనం అంతా ఆ బ్రిడ్జిమీంచి నడవచ్చు" అన్నాడు,

చిట్టిబాబు ఎంతో ఓపికతో అక్కడ జరుగుతున్న ప్రతిపనిని చూస్తున్నాడు. ఆ రోజు ఊళ్ళోకి చాలాకార్లు వచ్చేయి. ఎంతోమంది మనుష్యులు వచ్చేరు కుర్చీలలో కూర్చున్న వాళ్ళకి పువ్వుల దండలు వేసేరు. పాటలు పాడేరు. అన్నీచూస్తున్నా,

వింటున్నా అక్కడ జరుగుతున్నదేమిటో చిట్టికి అర్థంకాలేదు.

"అన్నయ్యా వీళ్ళంతా ఏంచేస్తున్నారురా" అని ప్రశ్నించేడు.

"అదిగో ఆయన మాట్లాడతున్నారు. విను" అన్నాడు చిట్టిబాబు అన్న.

మధ్య కుర్చీలో కూర్చున్న ఆయన లేచి ఉత్సాహంగా మాట్లాడుతున్నారు. చాలా శ్రద్ధగా విన్నాడు చిట్టి. కాని కొంచెంకూడా బోధ పడలేదు.

"ఆయనేం చెప్తున్నారు అన్నయ్యా?"

"చాల మంది కష్టపడి ఈ బ్రిడ్జి కట్టేరా! గవర్నమెంటు వారు చాలా సొమ్ము ఖర్చు పెట్టేరా! అదంతా చెప్పుతున్నారు. అన్నాడు చిట్టి అన్న.

ఆ బ్రిడ్జి ప్లాను తయారు చేసిన ఇంజనీరుకి, ఆ పనిని పటిష్ఠంగా చేసి వేస్చిన కంట్రాక్టర్లకి, ఆ బ్రిడ్జి నిర్మాణంలో సహకరించిన ఇతర గ్రామ పెద్దలకి ధన్యవాదాలు చెప్పేరు పంచాయితీబోర్డు ప్రసిడెంటు. ఒక్కొక్కరి పేరు ఉచ్చరించే పని మిన్ను ముట్టేలా చప్పట్లు కొట్టేరు అక్కడ చేరిన గ్రామస్థులు.

ఆ పేర్లలో కొన్ని అదివరలో చిట్టిబాబు విన్నవే. ఎంతో ఉత్సాహంగా వింటున్నాడు. ఇంకా ఎవరెవరి పేర్లు చెప్తారా అని ఆత్రంగా ఎదురు చూస్తున్నాడు. సభ పూర్తయి అంతా లేచి పోతున్నా ఇంకా జరగ వలసిందేదో జరగలేదన్నట్లు కూర్చున్న చోటునుంచి లేవ లేదు చిట్టిబాబు.

గ్రామస్తులంతా అధికార్ల వెనక ఆనందంగా బ్రిడ్జి దాటుతున్నారు.

"నువ్వు, రావా చిట్టీ" అన్నాడు అన్న.

"ఊహూ" తల తిప్పుకొన్నాడు చిట్టి.

తిన్నగా ఇంటికి వెళ్ళిపోయేడు.

"పిల్లలంతా వెళ్ళుతూంటే నువ్వు పోలేదేం?" అని ప్రశ్నించింది తల్లి. చిట్టిబాబు అంతగా పాలొన్న ప్రాణి ఆ గ్రామంలో మరిఒకరు లేరనే చెప్పాలి. దానికి వాడిన ప్రతిరాయి, ప్రతి ఇనపకమ్మి తనదే అయినట్లు కబుర్లు చెప్పేవాడు. రాత్రి నిద్రలో ఆ మాటలే కలువరించేవాడు. ఆ బ్రిడ్జి రూపం దాలుస్తుంటే చిట్టిబాబు పొందిన ఆనందం తల్లికి తెలియంది కాదు.

ఇదేం సరదాగా ఉండవలసిన ఈ రోజున పీకు ఇలా ఉన్నాడు అనుకొంది.

మరునాటి రోజు ఉదయం ఆ వాడలోని ఆడవాళ్ళంతా బ్రిడ్జి చూసిందికి బయలుదేరారు. ఎంతకాలంగానో ఎదురు చూసిన ఆ వంతెన పని పూర్తి కావడం వారికి ఆనందం కలిగించింది.

"ఈ వంతెనతో మన ఊరుకి కళ వచ్చింది."

"ఇంక ఏరు దాటిందికి వరదవేళలు చూసుకోనక్కర లేదు."

"పట్నం పోవాలంటే చుట్టుదారి బస్సులో గంటసేపు కూర్చోనక్కరలేదు."

ఇలా ఎవరికి తోచింది వాళ్ళంటూ బ్రిడ్జిమీద నడుస్తున్నారు. అంతలో ఒక స్త్రీ "అయ్యొ వీళ్ళచేతులు పడ. కొత్తగోడపై మసిబొగ్గుతో వ్రాసి ఎలా తగల పెట్టేరో!" అంది. అందరి చూపులు అటు మళ్ళేయి. "ఈ బ్రిడ్జి గోపన్న తాత కట్టేడు." వంకర టింకర అక్షరాలు గోడ పొడుగునా వున్నాయి.

చిట్టిబాబు తల్లి ఆ దస్తూరి పోల్చుకొంది.

"అంతమాట ఎందుకమ్మా అంటావు? ఎవరో పసివాడు చిన్నతనంకొద్దీ చేసిన పనికి" అందామె.

ఆ రాత్రి అకాలంలో కుండపోతగా వర్షం కురిసి వంకర టింకరగా ఉన్న ఆ మసిబొగ్గు వ్రాతని చెరిపివేసింది. తెల్లవారే సరికి కొత్త సిమెంటు గోడ స్వచ్ఛంగా, బలంగా నాగరికతకి చిహ్నంగా లేత ఎండలో నిలిచి ఉంది. ముందురోజు సాయంకాలం ఆ మసిబొగ్గు వ్రాతని చూసిన సూర్యకిరణం ఇంకా ఆ వ్రాత ఆ గోడపై నిలిచి ఉందా అన్న కుతూహలంతో అడ్డంకు లన్నిటినీ తప్పించుకొని ఓ కన్నంలోంచి తొంగి చూసింది. కరిగిపట్లున్న సిమ్మెంటు గోడని చూసి నిరాశగా తొలగి పోయింది.

★★★

